క్లుప్తంగా

ఇద్దరు మహిళల అరెస్ట్

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో చోరీకి పాల్పడ్డ కేసులో కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన దుగ్యాల శాంత, ఉంద్రాతి జ్యోతిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన పోత రాజు కుమారస్వామి ఇంట్లో గురువారం రూ.20 వేల విలువచేసే ఇత్తడి వస్తువులు, ఫ్యాన్లు, ఇతర గృహ సామగ్రిని దొంగిలించగా పట్టుకుని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

పట్టణంలో నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

పరకాల : పరకాల తాలుకా లీగల్ సెర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ఎఫ్‌జే గార్డెన్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ న్యాయవాదులు ఓంటేరు రాజమౌళి, ఆకినపల్లి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే న్యాయ విజ్ఞాన సదస్సుకు పరకాల తాలుకా లీగల్ సెర్వీసెస్ అథారిటీ చైర్మన్, పరకాల కోర్టు జడ్జి శాలిని లింగంతో పాటు ఏసీపీ సతీశ్‌బాబు, సీనియర్ న్యాయవాదులు చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో బిట్స్ విద్యార్థుల ప్రతిభ



పరకాల : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆపా పరకాల మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీల్లో బిట్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విద్యార్థినులు శ్రీధృతి, వర్షిణి, శ్రీహర్షిణి, ప్రశస్య, భవిజ్ఞను బిట్స్ పాఠశాల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ యుగేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నడికూడ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో టీచర్ సంపూర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి ముందస్తు క్రిస్మస్ వేడుకలను జరుపుకొన్నట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్‌లో ఎలుక నవీన్ కిరాణషాపు (బెల్టుషాపులో) నిల్వ చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. షాపులో అధిక ధరలకు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేయగా రూ.6,450 విలువచేసే మద్యం బాటిళ్లు లభించినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా వడ్డెపల్లి సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ సామ్యా నాయక్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జాతీయస్థాయి పోటీలకు కేవీ విద్యార్థి ఎంపిక

ఖిలా వరంగల్: భారత వాతావరణ శాఖ 150వ ఫౌండేషన్ డే సందర్భంగా ఇటీవల వాతావరణ శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కరీమాబాద్‌కు చెందిన కేవీ పాఠశాల విద్యార్థిని రాచర్ల లక్ష్మీప్రసన్న పాల్గొని మొదటి ర్యాంక్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి తెలిపారు. ఈమేరకు లక్ష్మీప్రసన్నను ప్రిన్సిపాల్‌తో పాటు అన్నదేవర ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ దాసి రజిని అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హసన్‌పర్తి క్రీడాకారులు

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి బి.వైష్ణవి, సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థిని జి.రిక్షిక, నేతాజీ పాఠశాల విద్యార్థి ఎన్.దీక్షిత్ ఎంపికయ్యారు. ఇటీవల జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ పార్థసారధి వివరించారు. ఈనెల 21న హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కోచ్ పార్థసారధి, శీలం నరేష్ అభినందించారు.

మురుగంతా జనావాసాల్లోనే..



డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్ల సమీపంలో నిలిచిన మురుగునీరు

- దోమలతో స్థానికుల బెంబేలు
- 16వ వార్డులో డ్రెయినేజీ లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్లే దారిలో గల 16వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక మురుగు నీరంతా జనావాసాల్లోనే పేరుకుపోతోంది. దీంతో పందులు స్వైర విహారం చేస్తుండటంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. రోజురోజుకు దోమలు వ్యాప్తి పెరిగిపోయి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమ కాటుతో అనారోగ్యం బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు తెలిపినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గతంలో ఇక్కడ సీసీ రోడ్డు నిర్మించినప్పటికీ డ్రెయినేజీలు మాత్రం నిర్మించలేదని తెలిపారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రెయినేజీ నిర్మించాలని కోరుతున్నారు.

దోమల వ్యాప్తి పెరిగింది



మా కాలనీలో కాల్వలు లేకపోవడంతో మురుగు నీరంతా ఇళ్ల సమీపాల్లోనే పేరుకుపోతోంది. దీంతో భరించలేని దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో కాలనీ వాసులు విష జ్వరాలు, ఇతర అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి డ్రెయినేజీ నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

\- ఇట్ట హనోక్, స్థానికుడు

డ్రెయినేజీ నిర్మించాలి



మా కాలనీలో సీసీ రోడ్లు నిర్మించిన అధికారులు.. డ్రెయినేజీ మాత్రం ఇప్పటి వరకు నిర్మించలేదు. దీంతో ఇళ్ల సమీపాల్లోనే మురుగు నీరు పేరుకుపోతోంది. మురుగునీటిలో పందులు సంచరిస్తున్నాయి. దీంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి డ్రెయినేజీని నిర్మించాలి.

\- గుంపుల తిరుపతి

ఉపాధిహామీ పనులు రైతులకు మేలు

- డీఆర్డీఓ మేన శ్రీను



దామెర : క్యాటిల్ షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న డీఆర్డీఓ శ్రీను

దామెర : ఎన్ఆర్ఈజీఎస్ పనులతో రైతులకు మేలు జరుగుతుందని డీఆర్డీఓ మేన శ్రీను అన్నారు. మండల కేంద్రంతో పాటు ల్యాదెళ్లలో ఉపాధిహామీ పథకంలో భాగంగా మంజూరైన పశువుల షెడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ.. రైతులు పశువుల షెడ్లు నిర్మించుకోవడంతో పాటు ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని అన్నారు. ఉద్యానవన పంటలకు తగిని ప్రోత్సాహం అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని పేర్కొన్నారు. గృహాల్లో పెంచే మొక్కలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయన వెంట ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టం ఆయుధం

- డాక్టర్ పల్లెపాడు దామోదర్



మాట్లాడుతున్న డాక్టర్ దామోదర్

కమలాపూర్ : వినియోగదారుల రక్షణ చట్టం సామాన్యులకు ఆయుధమని ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సీనియర్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. వినియోగదారుల జిల్లా సలహా సంఘం మండల కేంద్రంలో శుక్రవారం వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించింది. ఈ మేరకు ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 24వ తేదీన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాల గురించి పట్టణ ప్రాంతాల్లోని వినియోగదారులకు కొంత మేర అవగాహన ఉందని, గ్రామీణ ప్రాంత వినియోగదారులు ఈ చట్టం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న అవసరాలు, ఉత్పత్తి, వ్యాపారంలో పోటీ, ఒకే వస్తువును వివిధ కంపెనీలు ఉత్పత్తి చేయడం వలన లోపిస్తున్న నాణ్యతపై అవగాహన కల్పించారు. వినియోగదారులను మోసగిస్తూ, బహుమతులు ప్రకటిస్తూ వ్యాపారం చేయడం ప్రస్తుతం మార్కెట్‌లో కొనసాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల రక్షణ చట్టం 2019ని అమలులోకి తీసుకొచ్చి వినియోగదారులకు మరిన్ని సేవలు అందించేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి కమిషన్ పరిధి పెంచిందన్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్, తప్పుడు ప్రకటనలపై ఈ కొత్త చట్టం ద్వారా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. నష్టపోయిన వినియోగదారులు జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసి చట్టపరంగా నష్టపరిహారం పొందొచ్చన్నారు. సభ్యులు కవిరాజ్, ఇందిర, అక్తర్, శ్రీలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి స్రవంతి, సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్ శారదతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

- ఏసీపీ సతీశ్‌బాబు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు

పరకాల : విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ విద్యపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యసాధన కోసం కృషిచేయాలని పరకాల ఏసీపీ సతీశ్ బాబు అన్నారు. పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు స్వేరోస్, ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా విద్యార్థులంతా కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు శనిగరపు సాంబయ్య, మంద మనోజ్, శనిగరపు సాజన్, దొగ్గెల వినయ్, బొచ్చు రాజు, సతీష్, హాస్టల్ సంక్షేమ అధికారి ప్రశాంతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు బాసాని కైలాసం అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు బాసాని లక్ష్మీనారాయణ, నాయకులు బాసాని సదాశివుడు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శైలజ

పరకాల : రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శైలజ ఐకేపీ సెంటర్ల నిర్వాహకులను కోరారు. శుక్రవారం మాదారం పీఏసీఎస్ పరిధిలోని రైతు కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. తరుగు పేరుతో కోతలు విధిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ జిల్లా డైరెక్టర్, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, ఆర్ఐ దామోదర్, సీఈఓ రాజేందర్ పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు అర్థరహితం

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్
- కేంద్ర హోంశాఖ మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- పలుచోట్ల దిష్టిబొమ్మల దహనం



దామెర : ఊరుగొండలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఆత్మకూరు : పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని గుడెప్పాడ్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం సీఐ సంతోశ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్, నాయకులు రజనీకాంత్, సుధాకర్, భిక్షపతి, ఐలయ్య పాల్గొన్నారు.

ధర్మసాగర్ : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అందరివాడని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలకు దళితులంటే చిన్నచూపు అని, బీఆర్ అంబేడ్కర్ అంటే దళిత వర్గానికి చెందిన వ్యక్తి కాదని, యావత్ భారత దేశ ప్రజల ఆరాధ్య దైవమని కొనియాడారు. ఒక్కటే మతం, ఒక్కటే పార్టీ బీజేపీ అనే విధంగా ప్రధాన మంత్రి జపం చేస్తున్నారని విమర్శించారు. అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డీహెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆ సంఘం మండల కార్యదర్శి రాజారపు రత్నం ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. హనుమకొండ జిల్లా కార్యదర్శి రెంటాల దేవా, సీనియర్ నాయకుడు బట్టు మల్లయ్య, నాయకులు వెంకటేష్, రాజారపు దేవన్న, కమలాకర్ కొట్టే ప్రభాకర్, రాజారపు శీను, జకరయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : నినాదాలు చేస్తున్న నాయకులు



ఆత్మకూరు : సీఐ సంతోశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

దామెర : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కుల రవి తెలిపారు. ఈ మేరకు మండలంలోని ఊరుగొండలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, పాలాభిషేకం చేశారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, పాలెపాక శ్రీనివాస్, రాంచందర్, సుధాకర్, రజిత, శ్రావణ్‌రెడ్డి, వీరయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్య శారద



ఆత్మకూరు : సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద

ఆత్మకూరు : ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సత్య శారద అన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామపంచాయతీలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రతి అంశాన్ని పరిగణంలోకి తీసుకుని లబ్ధిదారుల వివరాలు సేకరించి సంబంధిత వెబ్‌సైట్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. సర్వేపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫీల్డ్‌లో ఉండి సర్వే పూర్తిచేయాలని అన్నారు. సర్వే వివరాలను నమోదు చేసేటప్పుడు తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. కాగా గ్రామంలో 995 ఇళ్లకు గాను 1087 ఇళ్ల సర్వే పూర్తి చేసినట్లు సిబ్బంది వివరించారు. నోడల్ అధికారి రాజేందర్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో అడిషనల్ కలెక్టర్..

ఎల్కతుర్తి : మండల కేంద్రంతో పాటు చింతలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా జరగాలని అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కొనసాగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. అక్కడి నుంచి ఓల్డేజీ రూమ్ కోసం గతంలో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించగా పక్కనే స్మశాన వాటిక ఉండడంతో మరోచోట ప్రభుత్వ స్థలం ఉంటే ఓల్డేజీ రూమ్‌కి కేటాయించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అన్ని వివరాలు నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఆర్ఐ సదానందం, గ్రామపంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఈ మేరకు వివిధ గ్రామాల్లో సర్వే తీరును ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న శుక్రవారం పరిశీలించారు. దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు, ఇంటి యజమాని ఫొటో, స్థలం వివరాలు, ఇంటి ఫొటో తదితర వివరాలను యాప్‌లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నమోదు చేశారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి




మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

శాయంపేట : రెవెన్యూ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) కృషి చేస్తుందని ఆ యూనియన్ జిల్లా ఇన్‌చార్జ్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రంజిత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ సత్యనారాయణతో పాటు, రెవెన్యూ ఉద్యోగులకు టీజీఆర్ఎస్ఏపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు అన్ని కేటగిరీలకు ఈ సంఘంలో ప్రాతినిథ్యం వహిస్తున్నారని అన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో అవకాశాలు కల్పిస్తామని అన్నారు. వీఆర్వో వ్యవస్థ రద్దుతో మండల రెవెన్యూ ఆఫీసర్ల మీద పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. అటెండర్ స్థాయి వారికి కూడా జిల్లాలు దాటి జోనల్‌స్థాయిలో బదిలీ చేస్తున్నారని అన్నారు. రెవెన్యూ ఉద్యోగులు అధిక సంఖ్యలో సభ్యత్వాలు తీసుకుంటున్నారని, అతి త్వరలో అడహక్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీలు నాగేంద్రప్రసాద్, రమేశ్, ఆర్ఐ శ్రీధర్, శాయంపేట డిటీ ప్రభావతి, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ వెంటనే ఏర్పాటు చేయాలి

- ఎంపీడీఓకు యూత్ సభ్యుల వినతి



ఎంపీడీఓ గుండె బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రగతి యూత్ సభ్యులు

కమలాపూర్ : మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ప్రగతి యూత్ అధ్యక్షుడు బాలసాని చిన్న కుమారస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రగతి యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ గుండె బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. స్థానిక యువత ఎంతోకాలంగా ఓపెన్ జిమ్ కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదని, అదే విధంగా గ్రామపంచాయతీ ఆవరణలో ఓపెన్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. కమలాపూర్‌లో ఓపెన్ జిమ్, ఓపెన్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీడీఓను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యూత్ ఉపాధ్యక్షుడు తోడేటి సుందర్, పబ్బు జగన్, ప్రధాన కార్యదర్శి పబ్బు అశోక్, సహాయ కార్యదర్శి పచ్చిమట్ల రాజేందర్, సభ్యులు మంద చరణ్, పెరుమాండ్ల ఓంకేష్, మంద రాజు, తోడేటి కుమారస్వామి, కొత్తకొండ సాయికుమార్, రాజు, శ్రీకాంత్, మార్క ప్రదీప్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో గల సర్వేనంబర్ 263 ప్రభుత్వ భూమిలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ సత్యనారాయణకు ఏఎంసీ డైరెక్టర్ శానం కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వేముల రమేశ్ శుక్రవారం వినతిపత్రం అందించారు. సర్వేనంబర్ 263లో ఇళ్ల స్థలాల కోసం కేటాయించారని, ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకోకపోవడంతో స్థలం ఖాళీగా ఉందని తెలిపారు. ఆ స్థలంలో జీపీ భవనం నిర్మించాలని వినతిలో కోరారు.

పేదల స్థలాలను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న సాంబయ్య

కాజీపేట: కబ్జాలో ఉన్న ప్రభుత్వ స్థలాలను 58 జీఓ ప్రకారం నిలువ నీడలేని నిరుపేదల కోసం క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య కోరారు. కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలో శుక్రవారం జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని సూచించారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు తొట్టె మల్లేశం, తిక్క సాంబయ్య, కూరం దేవేందర్, సునీత, కొట్టె రజిత తదితరులు పాల్గొన్నారు.